1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శుక్రవారం | డిసెంబర్ 27, 2024 | www.navatelangana.com

ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్

దివంగత ఆదివాసీ ఉద్యమ నాయకుడు ఉయిక సంజీవ్ కుమార్తె చదువుల నిమిత్తం ఆర్థిక సాయంగా రూ.50వేలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం అందజేశారు. ఉయిక సంజీవ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతా మాత్రంగానే ఉండడంతో కుమార్తె చదువుకు ఆటంకం కల్గకుండా ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని యువతికి సూచించారు. అన్ని విషయాల్లో అండగా ఉంటానని, అధైర్య పడొద్దని పేర్కొన్నారు.



పెట్రోల్ ట్యాంకర్‌కు అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-ఇచ్చోడ

రామగుండం నుండి ఇచ్చోడ మండల కేంద్రానికి వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ వాహనానికి ఆకస్మికంగా నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు, ఎస్సై తిరుపతి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో కొంతమేర మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం అగ్నిమాపక వాహనం రావడంతో అగ్నిమాపక సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను ఆర్పేశారు. దీంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. మంటలు అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



హస్తానిదే ఆధిపత్యం..!

- ఉమ్మడి జిల్లాలో బలం పెంచుకుంటున్న కాంగ్రెస్
- పథకాల అమలుతో జనంలో సానుకూల వైఖరి
- అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతున్న నాయకులు
- ఇప్పటికే పలు మున్సిపాలిటీలు కైవసం
- ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్,బీజేపీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. కిందటేడాది కారు జోరు కనబర్చగా.. ఒక్క ఏడాదిలోనే పరిస్థితి తారుమారైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆధిపత్యం కనబరుస్తోంది. అధికార పార్టీగా ప్రజల్లో మరింత బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో ప్రజల్లోనూ ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరి ఏర్పర్చుకుంటోంది. రాజకీయంగా ఉమ్మడి జిల్లాలో మరింత పట్టుసాధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే పలు మున్సిపాలిటీలు కైవసం చేసుకోగా.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తాచాటేందుకు సిద్ధమవుతోంది. ఇక ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లు గెలిచిన బీజేపీ ప్రతిపక్ష పాత్రకే పరిమితమవుతోంది. ఇక కిందటేడాది వరకు పది ఎమ్మెల్యే స్థానాలతో అగ్రస్థానంలో ఉన్న బీఆర్ఎస్ రెండు సీట్లకు పరిమితమై ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది.





ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది అధికార పార్టీదే హవా కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మెరుగైన పనితీరు కనబరుస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్,బెల్లంపల్లితో పాటు ఖానాపూర్ అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీటితో పాటు పెద్దపల్లి ఎంపీ స్థానంలోనూ విజయం సాధించి తూర్పు జిల్లాలో ఆ పార్టీ పూర్తి పట్టు సాధించింది. ఇక ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, సిర్పూర్(టి) స్థానాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఆదిలాబాద్ ఎంపీ స్థానంలోనూ విజయం సాధించింది. కేంద్రంలో అధికారంలో ఉన్నా..రాష్ట్రంలో మాత్రం ప్రతిపక్ష పాత్రకే పరిమితమయ్యారు. ఇక బోథ్, ఆసిఫాబాద్ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లోనూ కాంగ్రెస్ ఇన్‌చార్జీలే హవా కొనసాగిస్తున్నారు.

ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ పథకాలతో పాటు అభివృద్ధి పనుల మంజూరులోనూ ప్రభుత్వం నియోజకవర్గాల ఇన్‌చార్జీలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అధికారంలోకి రాగానే బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో తూర్పు జిల్లాలో పలు మున్సిపాలిటీలను సైతం హస్తగతం చేసుకుంది. వీటితో పాటు పలువురు స్థానిక సంస్థలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. పలువురు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కీలక నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ ఎన్నికల నాటి కంటే మరింత బలోపేతంగా కనిపిస్తోంది. ఇదే ఊపుతో రానున్న స్థానిక సంస్థల్లోనూ సత్తాచాటేందుకు సిద్ధమవుతోంది. మరోపక్క ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌కు సమానంగా ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ స్థానంలో విజయం సాధించిన బీజేపీ సైతం రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతుండగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో విజయం సాధించి మునుపటి పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఇక ఇటీవలే జిల్లా మహాసభలు పూర్తిచేసుకున్న సీపీఐ(ఎం) సైతం ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా జనంలో మరింత పట్టుసాధించాలని భావిస్తోంది.

పథకాల అమలుతో సానుకూల వైఖరి..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యం, రూ.500గ్యాస్ సబ్సిడీ, రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడం, ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనం జమ చేయడం, ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల ఎంపిక ప్రక్రియ చేపడుతుండటం వంటి కార్యక్రమాలతో ప్రభుత్వానికి ప్రజల్లో సానుకూల వైఖరి తీసుకువచ్చాయి. మరోపక్క ఖరీఫ్‌లో రైతు భరోసా ఇవ్వకపోవడం.. రూ.2లక్షల వరకు రుణమాఫీ ఇంకా పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ఆయా రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక ఆరుగ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం హామీనిచ్చిన పింఛన్ రూ.4వేల పెంపు, రేషన్‌కార్డుల జారీ, మహిళలకు రూ.2500చొప్పున అందజేయడం వంటి వివిధ పథకాల అమలు కోసం జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటిని కూడా అమలు చేస్తే ప్రజల్లో మరింత సానుకూల దృక్పథం ఏర్పడటంతో పాటు పార్టీ బలోపేతానికి కూడా దోహదం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.







రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్గొండ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఆరవ విద్యా వైజ్ఞానిక మహాసభ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు దాసరి శంకర్, అశోక్ మాట్లాడుతూ ఆన్‌డ్యూటీగా విద్యా వైజ్ఞానిక సదస్సుకు అనుమతించినందున ఉపాధ్యాయులకు రెండు రోజులు ఆన్ డ్యూటీ సౌకర్యం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రిమ్స్‌ను సందర్శించిన బోథ్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్ : రిమ్స్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న పేషంట్లతో ముచ్చటించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌తో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చురుగ్గా వైద్యం అందేలా చూడాలని, వసతులను మెరుగు పరచాలని సూచించారు. రిమ్స్‌లో గల సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుడిహత్నూర్ మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన రంగారావ్‌ను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సురక్ష ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌లో చిన్నపిల్లల సురక్ష ఆసుపత్రిని ఎమ్మెల్యే పాయల శంకర్ గురువారం ప్రారంభించారు. ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేకు డాక్టర్ కె.శివకుమార్, కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆసుపత్రి ప్రధాన ద్వారాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను, బిజెపి నాయకులు, విద్యానగర్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ తదితరులను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నార్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన చౌహాన్ లక్ష్మణ్ భార్య కొన్ని రోజుల క్రితం మృతి చెందగా మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో పిఎసిఎస్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖాసిం, షేక్ ముబసిర్, లోకండె చంద్రశేఖర్, సుభాష్ ఉన్నారు.

చెత్త వాహనంలో నవజాత శిశువు మృతదేహం

నిర్మల్‌టౌన్: మున్సిపల్ చెత్త వాహనంలో నవజాత శిశువు లభ్యమైన ఘటన గురువారం నిర్మల్‌లో జరిగింది. మున్సిపాలిటీకి చెందిన ఓ వాహనం చెత్త పడేయడానికి డంపింగ్ యార్డుకు వెళుతుండగా మార్గమధ్యలో కవర్ కింద పడిపోగా అందులో నుంచి నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. వెంటనే కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆదిలాబాద్ ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశం నిర్వహించి పార్టీ నాయకులతో కలిసి మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అభివృద్ధి-ప్రజా సమస్యలు భవిష్యత్ పోరాటాలపై తీర్మానాలు, చర్చలు జరుగుతాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలను మతం ఆధారంగా విడదీస్తోందని విమర్శించారు. అదానీ, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ సామాన్య ప్రజలపై జీఎస్టీ పేరిట ఆర్థిక భారాలు మోపుతోందని తెలిపారు. మత ఆధారిత ఎజెండా అమలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలు నింపుతోందని, దీన్ని పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించేందుకు మహాసభలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆరు గ్యారెంటీల అమలు ఊసే లేదని, ప్రజా పోరాటాలపై నిర్బంధాలు విధిస్తూ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో మూడేండ్ల కాలంలో చేయాల్సిన పోరాట కార్యాచరణ రూపొందించి పార్టీ అభివృద్ధికి చేయాల్సిన పనులపై తీర్మానాలు చేస్తారని తెలిపారు. ఈ రాష్ట్ర మహాసభలకు జాతీయ నాయకత్వం హాజరవుతుందని తెలిపారు. ఆదిలాబాద్ ఏరియా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, ఏరియా కమిటీ సభ్యులు ఎస్.స్వామి, గంగన్న, ఆత్రం, కిష్టన్న, పొచ్చక్క, వెంకన్న, గంగారాం, ఆశన్న పాల్గొన్నారు.



భిక్షాటన చేసి సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం 17వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగ ఉపాధ్యాయులు గురువారం భిక్షాటన చేస్తూ తమ సమస్యలు అందరికీ తెలిసే విధంగా చేశారు. రోడ్లపై తిరుగుతూ తమ కోర్కెలు తీర్చాలని, విద్యా వ్యవస్థకి మూల స్తంభాలైన తమందరిని రెగ్యులరైజ్ చేసి, విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో శుక్రవారం నుంచి బోధనేతర సిబ్బంది కూడా సమ్మెలోకి దిగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం అధ్యక్షులు గంగాధర్, రాజారత్నం, తిరుమల, గోదావరీ, సౌజన్య, సునిత, పోసాని, లక్ష్మణ్, భోజన్న, రవి సమత, సుమతి, సునీత, శ్రీనివాస్, నవిత, విమల, వసంత, లతదేవి, జ్యోతి, వీణ, అపర్ణ పాల్గొన్నారు. దీక్షకు టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మురళీమనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినోద్‌రాజ్, శివ ప్రసాద్, ధర్మరాజ్, పాండురంగ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు జిల్లా క్రీడాకారులు గురువారం బయల్దేరి వెళ్లారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో సౌకర్యాలు కల్పించి సాగనంపారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ గ్రామ, మండల, అర్బన్, జిల్లా స్థాయిలో ప్రతిభ కబనర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. బాస్కెట్ బాల్, ఆత్యాపాత్యా, కిక్ బాక్సింగ్ జిల్లా జట్లు ఆదిలాబాద్ నుంచి బయల్దేరాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి హరిచరణ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని తీర్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీఆర్టీయు తెలంగాణ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఆడే నూర్‌సింగ్ అధ్యక్షతన గురువారం స్థానిక బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తీర్మానం చేశారు. సమావేశంలో పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర నాయకత్వం తీసుకెళ్లి పరిష్కరించాలని తీర్మానించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, 317 జీవో బాధితులకు అందరికీ న్యాయం చేయాలన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల స్థానంలో ఇస్తున్న డిప్యుటేషన్‌లను రద్దు చేస్తూ వారి సమస్యను సత్వరంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, గిరిజన విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విట్టల్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి మోహన్‌సింగ్, జిల్లా కోశాధికారి ముజీబ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి బాబు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, రమేష్, రామేశ్వర్, గణేష్, రాజేశ్వర్, దేవిచంద్, వేణు పాల్గొన్నారు.

సీఆర్టీలకు సంఘీభావం తెలిపిన టీటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట చేపట్టిన సమ్మెకు గురువారం టీఎస్‌టీటీఎఫ్ సంఘం ఫౌండర్ లక్ష్మణ్ నాయక్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు రోడ్డుపై వచ్చి సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. సీఆర్టీలకు ఉద్యోగ భద్రతతో పాటు వారి డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. నేటితో పది రోజులు గడిచాయని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి



వారి కుటుంబాలని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరు నాయక్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్, రవీందర్ నాయక్, రాష్ట్ర కోశాధికారి శ్యామలాల్, మంగ్య నాయక్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చవాన్ నరేష్, దినేష్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని నక్కలవాడ గ్రామంలోని గురువారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకుంటే మానసికోల్లాసం ఉంటుందన్నారు. అలాగే మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ నియోజవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మహేందర్, షేక్ రజియా బేగం, నాయకులు శంకర్, లింగారెడ్డి, అబుద్, రాజురెడ్డి, జాదవ్ ఉమేష్, సంజీవ్, కేశవ్, గంగాధర్, గంగారాం, దేవేందర్, రాజు కుమార్ పాల్గొన్నారు.



అమరవీరుల సాక్షిగా సీఆర్టీల ఉద్యమం ఆగదు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా సీఆర్టీల సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిండిగల్ యాదవ్ అన్నారు. సీఆర్టీల సమస్యలపై గత పదిహేడు రోజులుగా కొనసాగుతున్న సమ్మెకు తుడుం దెబ్బ నాయకులు గురువారం సంఘీభావం వ్యక్తం చేశారు. ముత్నూర్ గ్రామంలో కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వరకు పాద యాత్ర నిర్వహించారు. అక్కడ జిల్లా నలుమూలల నుంచి వచ్చి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రమంతా 19 వేల పదిహేడు మంది సీఆర్టీలుగా పని చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు సీఆర్టీలను రెగ్యులరైజేషన్‌తో పాటు వారికి పేస్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలో రాగానే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఆర్టీలు గత 17 రోజులుగా చేస్తున్న సమ్మెతో ఆశ్రమ పాఠశాలలో బోధన కుంటుపడిందని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరసనను రోజు రోజుకు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, ప్రియాంక, ధరమ్ సింగ్, దీప్తి, మమత పాల్గొన్నారు.

నేటి తరం పిల్లలకు చరిత్ర తెలియాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి తరం పిల్లలకు చరిత్ర గురించి తెలియాల్సిన అవసరముందని అప్పుడే వారు చరిత్ర సృష్టిస్తారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సాహెబ్‌జాదాలు, బాబా అజిత్ సింగ్, బాబా జుఝర్సింగ్, బాబా జొరావర్సింగ్, బాబా ఫతేసింగ్ త్యాగాలను స్మరించుకుంటూ వీర్‌బాల్ దివస్‌ను నిర్వహించారు. గురువారం పట్టణంలోని ప్రగతి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని బాల్వేర్, భారత మాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చరిత్రను కనుమరుగు చేయడంతో పాటు వక్రీకరించారన్నారు. సమాజం. దేశం కోసం కొంత చేస్తే కొండంతగా చేసి చూపించారన్నారు. దేశం కోసం సాహిబాదాలు, బాబా అజిత్ సింగ్, బాబా జుఝర్సింగ్, బాబా జొరావర్సింగ్, బాబా ఫతేసింగ్ చేసిన పోరాటలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చిన్న వయస్సులోనే వారు ప్రాణాలను ఫణంగా పెట్టి ఉద్యమించారని తెలిపారు. వారి గురించి ప్రతి పాఠశాలలో గ్రామగ్రామన తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, అధినాథ్, బ్రహ్మానంద్, సల్ల విజయ్ బాబు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కంప్యూటర్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. వనవాసి కళ్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్‌లో ప్రపంచమంతా ముందుకు వెళుతుందన్నారు. వనవాసి కళ్యాణ పరిషత్‌కు అవసరమయ్యే కంప్యూటర్లు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఆదివాసులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా గ్రామాలలో ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో వనవాసి కల్యాణ పరిషత్ నాయకులు జంగు, అజయ్, నాగేశ్వర్ ఉన్నారు.

సమాజ చైతన్యానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగం కల్పించిన అనగారిన వర్గాల హక్కుల కోసం సమాజ చైతన్యానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలోని జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంబేద్కర్ వాదం మీద రాజ్యాంగం మీద జరుగుతున్నటువంటి దాడులను ఖండించారు. అనగారిన వర్గాల కోసం డాక్టర్ భీంరావు అంబేద్కర్ చేసినటువంటి సేవల్ని కొనియాడారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నలగంటి నవీన్, ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేష్, తుల్జాపూర్ శోభతాయి, నిమ్మల ప్రశాంత్, ఈర్ల దయాకర్, అగ్గిమల్ల గణేష్, కుమ్మరి సత్యనారాయణ, సూరం రాహుల్, సూరం భూమన్న, మైస విఠల్, ఉశన్న, బెర శ్రీనివాస్ ఉన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగు నీరందిస్తాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

రబీ పంటకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, జన్నారం రైతులతో రబీ పంట సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వారు పేర్కొన్నారు. గత పదేండ్ల పాలనలో కడెం ప్రాజెక్టు మరమ్మతులకు చిల్లిగవ్వ ఇవ్వలేదని దాని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రత్యేక చొరవ చూపి కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.9కోట్ల 46 లక్షలు మంజూరు చేశారని, ఇప్పుడు ప్రాజెక్టు సురక్షితంగా ఉందని అన్నారు. ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, జన్నారం రైతుల పంట సాగుకు నిరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. జనవరి 5 నుంచి నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. కొందరు తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, ప్రజలేవరూ అలాంటి తప్పుడు మాటలను అపోహలను నమ్మకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శైలజ రమేష్ రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షులు రెంకల శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ సింగిల్ విండో డైరెక్టర్లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, ఇసు పటేల్, బ్రహ్మచారి, కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాల రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిసెంబరు 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం కుమురంభీమ్ భవన్‌లో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట నారాయణ మాట్లాడుతూ విప్లవకారుల ఐక్యత కోసం రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ డిసెంబర్ 28న జరుగుతుందని దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ప్రధాన వక్తగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ధర్శన్ సింగ్ ఖట్కర్ హాజరవుతారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ, ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత పది ఏండ్ల కాలంగా కార్పొరేట్ విధానాలను అవలంబిస్తూ, దేశ సహజ సంపదనంతా దోచిపెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, హక్కులు, ప్రశ్నించే వారిని అణిచివేయడం, నిత్య కృత్యంగా జరుగుతుందన్నారు. ఇలాంటి కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులు అంతా ఐక్యమై ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. నక్సల్‌బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీ ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కాంక్షించారన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి, బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, శేషారావు, అఖిల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎర్రాజి హరీశ్, జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తు, పీవైఎల్ జిల్లా నాయకులు సుంగు పాల్గొన్నారు.

అనేక సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు

- ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అనేక సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేస్తోందని, ఎన్నో ప్రజా ఉద్యమాలు చేపట్టి విజయాలు సాధించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దతాబ్ది కాలంలో చేసిన ఎన్నో త్యాగాలు, పోరాటాలను నేటి తరానికి తెలియజేసేందుకే సీపీఐ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామ గ్రామాన వేడుకలను జరుపుతున్నామని, జెండాలను ఎగరేస్తున్నామని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ కీలక భూమిక పోశించిందన్నారు. దేశంలోని సంపద రక్షణకు, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, సీపీఐ సీనియర్ నాయకులు కట్ట చంద్రమౌళి, కట్ట కృష్ణ స్వామి, సీపీఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి జి.నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్కా దేవిదాస్, మెస్రం భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బత్తుల గంగారెడ్డి, గేడం కేశవ్, ఉస్మాన్, గంగయ్య, నాయకులు ఉన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా పరిష్కరించి, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని వేణునగర్ కాలనీలో రూ.34 లక్షలతో, లక్కారం గ్రామంలో రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గ్రామాల రూపు రేఖలను మార్చడానికి ప్రభుత్వం ముందడుగు వేసిందని, సమస్యలు ఉన్న ప్రతి చోట అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరుగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ జనవరి 5న ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మైదానంలో మధ్యాహ్నం 2గంటలకు పెద్ద ఎత్తున ఆదిలాబాద్ పెన్షన్ ఆక్రోష్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఉద్యోగులకు సామాజిక భద్రత లేని ఈ పెన్షన్ విధానాన్ని విడనాడాలని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. 2925 ఏప్రిల్ 1న అమలు చేయబోతున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాథోడ్ ఉపేందర్, ప్రధానకార్యదర్శి ఆనక అవినాష్, ఇంద్రవెల్లి మండలాధ్యక్షులు జాదవ్ మేఘనాథ్, నార్నూర్ మండలాధ్యక్షులు కృష్ణ, గాదిగూడ మండలాధ్యక్షులు జాదవ్ రంజిత్, సభ్యులు పవన్, దేవు, కైలాస్, శ్రీనివాస్, ప్రశాంత్, సాడిగే రాజు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ రూరల్ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో చిచ్‌ధరి గ్రామంలో నిర్వహించిన ఉచిత మేఘా వైద్య శిబిరానికి ఆత్రం సుగుణ ముఖ్యతిథిగా హాజరై, డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్, కిసాన్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇందిరా ఫెల్లోషిప్ సభ్యులతో కలిసి ఆదివాసీ గూడల్లో పర్యటించినప్పుడు గ్రామాల్లో సమస్యలతో పాటు ఇక్కడి ఆదివాసీ ప్రజల ఆరోగ్య స్థితి గతులను తెలుసుకోవటం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకోవటం ద్వారా ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కిడ్నీ, గుండె సమస్యలను ఎప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంచుకోవడానికి సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 200 మంది ఆరోగ్య పరీక్షలు చేసుకోవటం జరిగిందని అన్నారు. పట్టణాలకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సర్ఫరాజ్, సార్మెడీ మెస్రం గంగారాం, పటేల్ తొడసం లింగు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం బీజేపీ నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బర్ల హరీశ్ రెడ్డి, కేవీ నర్సారెడ్డి, షేక్ గోరేమియ, గంగారెడ్డి, రాజేశ్వర్, అశోక్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కన్న కలలకు అనుగుణంగా కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏండ్ల నుంచి కార్యకర్తలు కన్న కలలకు అనుగుణంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో నిర్మించిన నూతన బీజేపీ పార్టీ కార్యాలయాలన్ని ప్రారంభించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందంను ఆయన చాంబర్‌లో కూర్చోబెట్టి శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కూడా ఎమ్మెల్యేను సన్మానించి ఆశీర్వాచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ఐదుగురితో ప్రారంభమైన బీజేపీ నేడు బలంగా తయారైందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఎంపీ స్థానంతో పాటు నాలుగు ఎమ్మెల్యే సీట్లను సాధించిందని తెలిపారు. సరిహద్దులో సైనికుడు ఏ విధంగానైతే దేశ రక్షణలో ఉన్నారో, అదే విధంగా అంతర్గత రాజకీయాల్లో రాణించడానికి బీజేపీ మంచి వేదిక అని సూచించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. పార్టీ కార్యాలయం సొంత స్థలంలో నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కార్యకర్తలకు రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం ఇది వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గందే కృష్ణకుమార్, విజయ్ కుమార్, ఆకుల ప్రవీణ్, లాలామున్న, సుభాష్, సోమ రవి, ఆదినాథ్, వేణుగోపాల్, వేదావ్యాస్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ గ్రామాభివృద్ధి కమిటీ ఇటీవల నూతనంగా ఎన్నికైన గౌరవాధ్యక్షుడు అన్నెల లక్ష్మణ్, అధ్యక్షుడు పెరుమాండ్ల నారాయణలకు ఇచ్చోడ గ్రామ అయ్యప్ప స్వాములు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు అన్నెల లక్ష్మణ్ మాట్లాడుతూ దినదిన వ్యాపారం రంగంలో ఇచ్చోడ గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ కమిటి అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అయ్యప్ప స్వాములు సువర్ణ మాధవ్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేజీబీవీ, సమగ్రశిక్షా ఉద్యోగులు నిరసన చేపడుతున్న సందర్భంగా ఆయా మండలాల్లో కస్తూర్బా విద్యాలయాల్లో ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయాలని డీఈఓ రామారావు ఎంఈఓలను గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వారు కేజీబీవీ పాఠశాలల్లో వంట మనుషులు, వాచ్‌మెన్లు, టీచింగ్ స్టాఫ్‌ను సర్దుబాటు చేయాలని ఎంఈఓలకు సూచించారు.

డిప్యూటేషన్ ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలి : ఎస్టీయూ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో గత 17 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల స్థానంలో పాఠశాలలోకి ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్స్‌పై పంపించే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షులు భూమన్న యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తీసుకునే ఇలాంటి నిర్ణయాలతో ఇటు కేజీబీవీ, అటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం కుంటు పడుతుందని పెర్కొన్నారు. ఇప్పటికే 10వ తరగతి విద్యార్థులు చాలా నష్టపోయారని, ప్రభుత్వం త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆలం భీంరావు, ఆత్రం అమ్మక్కల కుటుంబాలను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. గురువారం మండలంలోని మొగవెల్లి సుష్మీర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. కుటుంబాలను పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తన హాయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందినట్టు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో గిరిజనులతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ మాంతయ్య, మండల నాయకులు బశరథకాస్, సకారం, పుల్లూరు సతీష్, కె.శంకర్, హనుమంతు, లంగారి శ్రీనివాస్, శ్రీదేవి, అమ్మాత, కోరితె తిరుపతి పాల్గొన్నారు.

పార్టీల విలీన సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-రెబ్బెన



ఈనెల 28న సీపీఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీల విలీన సభను హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. గురువారం పార్టీల విలీన సభ పోస్టర్లను విడుదల చేశారు. దేశంలో కులం, మతం, ప్రాంతీయ తత్వాలు, ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తూ దోపిడి లేని సమసమాజ స్థాపన కోసం జరగాల్సిన ఉద్యమాలను పక్కదారి పట్టించి పాలకవర్గాలు పబ్బం గడుపుకుంటున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి శ్రీనివాస్, పోచం, లింగయ్య, నాగలక్ష్మి, డి.శంకరమ్మ, భీమేష్, నరేష్, లింగయ్య, కమల, సునీత పాల్గొన్నారు.

కరెంట్ తీగలు తగిలి గేదెలు మృతి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కోర్సిని గ్రామంలో వేటగాళ్లుపెట్టిన కరెంట్ వైర్లు తగిలి అదే గ్రామానికి చెందిన దనూరి ఆశన్న, భూపతి శంకర్‌కి చెందిన రెండు గేదెలు చనిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న అటవీ, విద్యుత్ శాఖ అధికారులు సంఘట స్థలాన్ని పరిశీలించారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఆ కరెంట్ వైర్లుపెట్టిన వ్యక్తులు ఎవరనేది బయటకు రాలేదు. ఇదే విధంగా గత సంవత్సరం కూడా నర్మల సత్యక్క గెదె కూడా కరెంట్ షాట్ వల్ల చనిపోయింది. ఆ సమయంలో కూడా పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. అయిన గుర్తించలేదు. ఇలానే ప్రతి సంవత్సరం ఈ వేటగాళ్లుపెట్టే కరెంట్ వైర్లకు మనుషులు కూడా బలయ్యే అవకాశాలు ఉన్నాయని, ఎవరి ప్రాణాలు పోకుండా పోలీసులు వెంటనే వారిని గుర్తించి పట్టుకోని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాక్సింగ్‌తో మానసికోల్లాసం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బాక్సింగ్‌తో మానసిక ఉల్లాసం కలుగుతుందని టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం బాక్సింగ్ డేను పురస్కరించుకొని స్థానిక సర్‌సిల్క్ ఎఫ్ కాలనీలో ముత్తు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాక్సింగ్ పోటీలలో విజయం సాధించిన వారికి అవార్డులు, బహుమతులు అందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ బాక్సింగ్ నేర్చుకోవడం వల్ల శరీర దారుఢ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ముత్తు బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు వేముర్ల మధును సీఐ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ ఛైర్మన్ శివకుమార్ నాయర్, ప్రధాన కార్యదర్శి మధురై శేఖర్ మాస్టర్, కోశాధికారి రమాకాంత్ యాదవ్, ఉపాధ్యక్షుడు జయేందర్, ప్రొఫెసర్ మిస్ వాలెంటినా, నాయకులు జాకీర్, లలిత్, క్రీడాకారులు జిబ్బిబాయి, చెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

హిందీ పోస్టుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రతిపాదికన టీజీటీ హిందీ బోధనకు ఉన్న ఒక్క ఖాళీ కోసం దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌పీటీతో పాటు పీజీ కలిగి ఉండాలని టెట్ అర్హత ఉన్నవాళ్ల ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు 8106512531 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో మండలి పూజా సందడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు ఒడ్డున గల శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మండల పూజ శోభ సంతరించుకుంది. ఉదయం నుండి అయ్యప్ప భక్తులు స్వాములు పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గత వారం రోజుల నుండి మండల పూజకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివకేశవ ఆలయం నుండి స్వాములు భక్తులు పెద్ద ఎత్తున అయ్యప్ప విగ్రహంతో నగర సంకీర్తన రూపంలో భజనలు నిర్వహిస్తూ పురవీధుల గుండా తిరిగారు. పట్టణంలోని మహిళలు మంగళ హారతులతో స్వామివారిని దర్శించుకుని తరించారు. మహా పడిపూజ సందర్భంగా ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి సోనేరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి అన్నదాతగా ఎమ్మెల్యే దంపతులు వ్యవహరించగా, వారి కుటుంబ సభ్యులతో కలిసి వడ్డనలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు స్వాములు వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వర శర్మ ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి మహా పడిపూజ కోదాడకు చెందిన బాణాల సాయి శర్మ స్థానిక ఆలయ పూజారి నాగేశ్వర శర్మల ఆధ్వర్యంలో జరపడంతో పాటు పడిపూజకు వచ్చిన భక్తులకు అల్పాహారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు కాంద్ర కిషన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటగౌడ్, కోశాధికారి చంద్రమోహన్ తో పాటు గురు స్వాములు సభ్యులు నలిని మోహన్, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, రాజబాబు, వినయక్, రవీందర్ రెడ్డి, బాల రాము, గాధవేని మల్లేష్ పాల్గొన్నారు.

వేంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి అప్రోచ్ వర్క్ అయ్యేనా..?

నవతెలంగాణ-సిర్పూర్(టి)



కాగజ్‌నగర్ నుండి సిర్పూర్ ప్రధాన రహదారి మార్గమధ్యలో వేంపల్లి రైల్వే ఫ్లైఓవర్ పనులను 2016 సంవత్సరంలో రూ.30.03 కోట్ల నిధులతో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు ఆ పనులను నత్తనడకగా నేటి వరకు కొనసాగుతున్నాయి. పూర్తి కాకపోవడం నిర్లక్ష్యం ఎవరదని ప్రజలకు తెలియడం లేదు. ఏ రాజకీయ పార్టీ అధికారం చేపట్టిన ప్రజలకు ఒరిగేదేమి లేదని ఇదే ఉదాహరణగా చెప్పవచ్చు. అసమర్థత పాలకుల వలన కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను అసంపూర్తిగా చేశారని దీనికి ప్రధాన కారణం కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సరిగ్గా బిల్లులు చెల్లించకపోవడమేననే చర్చలు కూడా జరుగుతున్నాయి. ఈ మార్గంలో బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్ మండల నుండి నిత్యం రాకపోకలుంటాయి. ఇవే కాకుండా మహారాష్ట్ర చత్తీస్‌ఘడ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి భారీ లోడలతో కూడిన వాహనాలతో పాటు ప్రయాణికుల వాహనాల రాకపోకలుంటాయి. రైల్వే ఫ్లైఓవర్ అప్రోచ్ వర్క్ అసంపూర్తిగా ఉండడం వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గాన్నే జిల్లా, మండల ఉన్నత స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం వెళ్తుంటారు. ఈ సమస్యను మాత్రం ఒక్కరు కూడా దృష్టి పెట్టకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, నాయకులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన అప్రోచ్ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇటు విషయంపై ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణను సంప్రదించగా నిలిచిపోయిన అప్రోచ్ పనులను పూర్తి చేయాలని సదర్ కాంట్రాక్టర్, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని త్వరలోనే పనులు పూర్తవుతాయని తెలిపారు.

త్యాగాలు, పోరాటాల చరిత్ర ఎర్రజెండాది

- సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ
- ఘనంగా పార్టీ అవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-రెబ్బెన

త్యాగాలు, పోరాటాల చరిత్ర కలిగిన సీపీఐ జెండా పట్టుకొని నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి మాట్లాడుతూ ఈనెల 30న నల్లగొండ జిల్లాలో జరిగే పార్టీ ఆవిర్భావ ప్రారంభోత్సవ బహిరంగ సభ ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడేది కేవలం సీపీఐ జెండా మాత్రమేనని, అలాంటి ఎర్రజెండా వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బి.జగ్గయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు శేషశశినారావు, జూపాక రాజేష్, కనుకుంట్ల కిరణ్ బాబు, మీస చంద్రశేఖర్, పార్టీ బెల్లంపల్లి కార్యవర్గ సభ్యులు పుట్ట శ్రీనివాస్, కాంటాక్ట్ కార్మిక గోలేటి కార్యదర్శి సల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జాడి సాయి, ఫిట్ కార్యదర్శిలు ఎంబటి రామయ్య, కందుల మల్లేష్, మాల ఓదెలు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి 17వ రోజు నిరసన

- తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలకు ఖండన
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా 17వ రోజు గురువారం కలెక్టరేట్ ఎదుట రోడ్లు ఊడ్చి సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కిల్లి వెంకట్ రావు, మండల గౌరవ అధ్యక్షుడు ధనరాజ్,జిల్లా నాయకులు జలపతి, మధుకర్, చంద్రయ్య, రవీందర్, శంకర్, మల్లేషంలు పాల్గొని ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఖండన

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నాయకత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చానల్‌లో ఉపాధ్యాయ సంఘానికి తమలోని వ్యక్తిని ఆపాదించడాన్ని సంఘం జిల్లా అధ్యక్షురాలతో పాటు నాయకులు తీవ్రంగా ఖండించారు. అసత్య ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రాడ్యుయేట్ స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైస్ చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో భాగంగా పని చేస్తూ 17 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు చట్టబద్ధంగా నియమించబడ్డారన్నారు. వారిని రెగ్యులరైస్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పే స్కేల్ అమలు చేయాలని లేదా ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న వసతులనైనా కల్పించాలన్నారు. వీరి న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. 2023లో ఇదే సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెను విరమింపజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు వీరి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, గౌరవ అధ్యక్షుడు మోహన్, జిల్లా కోశాధికారి బోయిని నాగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో శంక భీంరావు మృతి



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామానికి చెందిన శంక భీంరావు అనారోగ్యంతో మృతిచెందాడు. గతంలో ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏలో పనిచేస్తూ అక్కడి నుండి ఏటూరు నాగారంలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. అనారోగ్యంతో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు వెంకట్‌రావ్ తెలిపారు. ఆయన మృతిపట్ల గ్రామస్తుల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి తీరనిలోటని గ్రామస్తులు అన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

మండలంలోని బంబారా గ్రామానికి చెందిన కినక భీంరావ్ భద్రాచలం ఏటూరు నాగారం ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్వగ్రామం బంబారాలో అనారోగ్యంతో మరణించడంతో ఆయన మృత దేహానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆమెతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీఆర్ఎస్ నాయకురాలు మరుసుకోల సరస్వతి, నాయకులు అధికారులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులున్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ ధ్వజస్థంభ ప్రతిష్టాపన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం ఎస్పీఎం న్యూకాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ధ్వజస్థంభ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గత రెండు రోజుల నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు గురువారం ధ్వజస్థంభం ప్రతిష్టించగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

- పీసీసీఎఫ్ సువర్ణ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ సంరక్షణ అభివృద్ధిలో ఉద్యోగులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని కంపా పీసీసీఎఫ్ సువర్ణ అన్నారు. సిర్పూర్-టి రేంజ్ పరిధిలోని ఇటుకల పహాడ్ గ్రామాన్ని సీఎఫ్ శాంతారాం, డీఎఫ్ఓ నీరజ్ కుమార్‌తో కలిసి సందర్శించి అక్కడ కంపా నిధులతో చేసిన ప్లాంటేషన్ పరిశీలించినంతరం గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అడవులను సంరక్షిస్తే భావితరాలకు ఎంతో గొప్ప సంపద అందించిన వారమవుతామన్నారు. ప్రజలు అటవీ అధికారులకి సహకరించాలని సూచించారు. అటవీ అభివృద్ధి కోసం చేసే ప్రతి పనిలో ప్రజలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వినయ్ కుమార్ సాహు, ఎఫ్ఆర్ఓలు ఇక్బాల్ హుస్సేన్, శశిధర్ బాబు, డీర్ఓ శ్రీధర చారి, ఎఫ్ఎస్ఓ మోహన్ రావ్, బీట్ అధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైకి పెద్దపులి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల సమీపంలో పెద్దపులి రోడ్డుపైకి వచ్చి సంచారం చేయడంతో ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు. మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం అమృత్‌గూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్న సమయంలో పెద్దపులి కలకలం సృష్టించింది. పంట పొలాల నుంచి ఒక్కసారిగా ప్రధాన రహదారిపైకి రావడంతో వాహనదారులు, చుట్టుప్రక్కల వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులకు పెద్ద పులి వస్తున్నట్టు మిగతా రైతులకు పెద్దపులిని చూసి కేకలు వేశారు. దీంతో వాహనదారులు రైతులు అప్రపత్తమయ్యారు. ఎలాంటి సంఘటన జరగకపోవడంతో ఊపిరి పిలుచుకున్నారు. పెద్దపులి సంచరిస్తున్న ప్రాంతంలో రైతులు పులి కదిలికలను గమనిస్తూ వ్యవసాయ పనులు చేసుకోవాలని ఇరు రాష్ట్రాల అటవీశాఖ సిబ్బంది సూచించారు.

సామాజిక అంశాలపై పోలీసు కళాబృందం అవగాహన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సామాజిక అంశాలు, చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ మోసాలపై పోలీసు కళాబృంధం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గురువారం తిర్యాణి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంగాపూర్ గ్రామంలో పోలీస్ కళాబృందం నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణపై అవగాహన, సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాధవ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోతే 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోందన్నారు. కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్తులను కోరారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. యువత చేడు వ్యాసనలకు అలవాటు పడి జీవితాన్ని నశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. మంత్రాలు తంత్రాలు మూడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమస్య ఉన్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ప్రయివేటు పాఠశాలలు బంద్

నవతెలంగాణ-కౌటాల

నేడు మండలంలో ప్రయివేటు పాఠశాలలు బందు పాటించనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమగ్ర శిక్షణ ఉద్యోగులు తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని తలపెట్టిన నిరసన దీక్షకు మద్దతుగా మండలంలోని ప్రయివేటు పాఠశాలలు బందు పాటించనున్నట్లు యాజమన్యాలు తెలిపాయి. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించి పాఠశాల యాజమాన్యాలకు సహకరించాలని కోరారు.

ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభించిన జీసీసీ చైర్మెన్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలో ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్, కిరణ షాప్‌ను తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ వాహనాలదే కాలం ఉంటుందన్నారు. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఉంటుందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిఫ్, గడ్డం త్రిమూర్తి, పింగళి రమేష్, తిరుపతి, నగేష్ పాల్గొన్నారు.

నిరుపేద ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని రాంపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తరాజుల నర్సవ్వ, కూతురు తరాజుల కల్యాణి వివాహానికి గల్ఫ్ సంక్షేమ సమితి రాంపూర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థిక సాయాన్ని అందించారు. తమ వంతుగా భవిష్యత్తులో కూడా అవసరమున్న వారికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు లింగాల వెంకటేష్, గజ్జెలి ఇజ్రాయెల్, సంగెపు వెంకటేష్, కిది శ్రావణ్, రత్నం క్రిష్ణ, అల్లునూరి భర్గవ్ పాల్గొన్నారు.

స్టేషన్ పెద్దనపల్లిలో పోలీసుల కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని స్టేషన్ పెద్దనపల్లిలో సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాసిపేట, మందమర్రి, రామయిపోష్టాపూర్, దేవాపూర్ ఎస్సైలు, సిబ్బంది, నార్కోటిక్ డాగ్, సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు ఉంటున్నారా లేదా అపరచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్, గుర్తింపు కార్డ్ పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోల ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 27 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను గుర్తించి వాటిని అక్కడికక్కడే ఫైన్ వేసి సరి చేశారు. 3 నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ అంజనేయులు, మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్ఐలు, సిబ్బంది, నార్కోటిక్ డాగ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

బీసీలకు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశం రాష్ట్రంలో బీసీ జనభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్న ఉద్యమాలకు తలొగ్గిన అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్‌కు తీర్మాణం చేశాయని, జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు చట్టసభలో 14శాతం ప్రాతినిధ్యం లేదని కేంద్ర ఉద్యోగాల్లో 11శాతం, స్థానిక బీసీ రిజర్వేషన్లు 18శాతం, కాంటాక్ట్ పారిశ్రామిక రంగంలో 1శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం రాజ్యాంగ సవరణ మాత్రమేనని జనాభా ప్రకారం రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉందని తెలియజేశారు. 103వ రాజ్యాంగ సవరణ చేసి అగ్రవర్ణ కులాలకు 10శాతం రిజర్వేషన్ పెట్టిన కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగాన్ని సవరణ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అలంబిస్తుందని, ఇప్పటికైనా బీసీలకు జనాభా ప్రాతి పాదికన సమాన వాటా ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు శాఖపూరి భీమ్‌సేన్, చంద్రగిరి చంద్రమౌళి పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులను నిరాశపర్చిన కేంద్ర మంత్రి పకటన

నవతెలంగాణ- జైపూర్

ఎవరి దయాదాక్షిన్యాలతో పని లేదు. గ్రాట్యూటీ పొందడం రిటైర్డ్ ఉద్యోగుల హక్కు. గ్రాట్యూటీ పేమెంట్ యాక్ట్ 1972 ప్రకారం రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక పారితోషికంగా సంస్థ ద్వారా పొందాల్సి ఉంటుంది. అయితే ఉద్యోగుల మధ్య వ్యత్యాసం చూపకుండా రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక నష్టం జరుగకుండా చూడాల్సిన బాద్యతగా సంస్థలు వ్యహరించాలి. ఆర్థిక సింగరేణి ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వరంగ అధికారులైనా కార్మికులైనా గ్రాట్యూటీ యాక్ట్ ప్రకారం సంబందిత సంస్థ ద్వార గ్రాట్యూటీ పొందాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు రూ.10 లక్షల గ్రాట్యూటీని రూ.20 లక్షలకు పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ క్రమంలో బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులందరికి వర్తింపజేయాలని నిర్ణయించారు. ఇక్కడ కార్మికులకు, ఉద్యోగులకు మధ్య వ్యత్యాసం చూపిస్తుంటాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ఒకే బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులకు వేరువేరుగా గ్రాట్యూటీ చెల్లింపులో వేరువేరుగా అమలు చేస్తున్నందున 14 నెలలుగా రిటైర్డ్ కార్మికులు ఆర్థికంగా నష్టపోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం నిరుపేదల ఆశలు

- ఎంపిక సర్వేలో అధికారులు
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు



మండలంలో సర్వేను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్(ఫైల్)

నవతెలంగాణ-తాండూర్

సొంతింటి కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేదల ఆశలు ఫలించనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. దీని కోసం లబ్ధిదారుల ఎంపికకు అధికారులు సర్వే కొనసాగిస్తున్న నేపథ్యంలో సొంతిల్లు లేని నిరుపేదల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో నైనా సొంతిల్లు కల నెరవేరకపోతుందా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు

ప్రజా పాలనలో అందిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు దరఖాస్తుదారుల నివాస గృహాల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ వివరాలు నమోదు చేస్తున్నారు. లబ్ధిదారుల నివాసగృహం స్థితిగతులు ఇంటి స్థలం వివరాలు ఆర్థిక సామాజిక స్థితిని యాప్‌లో నమోదు చేస్తున్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఏడు మండలాలు బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులు ఉన్నాయి. అధికారులు రాజకీయ ప్రమేయం లేకుండా మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తే నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరయ్యే అవకాశాలున్నాయి.

సర్వేలో అధికారులు..

జిల్లాల్లో కలెక్టర్లు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాలు, పురపాలికల్లో సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. రోజుకు కనీసం 20 దరఖాస్తులను సర్వే చేయాలని లక్ష్యం విధిస్తున్నారు. పురపాలికల్లో సర్వేయర్లుగా వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కార్యదర్శులు, ఎంపీడబ్ల్యూలు సర్వే పనిలో నిమగ్నమయ్యారు. సర్వే ప్రక్రియ వచ్చేనెల 5లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ పీడీలు క్షేత్ర స్థాయికెళ్లి యాప్ వివరాల నమోదు తీరును పరిశీలిస్తున్నారు. ఒకరోజు ముందే దస్త్రాలు సిద్ధం చేసుకునేలా గ్రామాలు, వార్డుల్లో సర్వే గురించి సమాచారం ఇస్తున్నారు. అధికారులు ఇళ్లకు వచ్చే సరికి దస్త్రాలన్నీ సిద్ధం చేసుకొని ఉండాలని దరఖాస్తుదారులకు చెబుతున్నారు. పత్తి ఏరివేత యాసంగి వ్యవసాయ పనుల్లో గ్రామీణులు తలమునకలవ్వడంతో గ్రామీణ ప్రాంతాలలో సర్వే పనులు సాఫీగా సాగటం లేదు. ఇందులో పలు సాంకేతిక సమస్యలు తలెత్తగా వాటిని సరి చేసి పూర్తి స్థాయి యాప్‌ను సిద్ధం చేశారు. ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కార్మికులు, ఆదివాసులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో యాప్‌లో ఈ వివరాలు పొందుపరుస్తున్నారు. దరఖాస్తుదారు ఉంటున్న సొంత లేదా అద్దె ఇంటి ఫొటోలను మూడు చొప్పున తీసి అప్లోడ్ చేస్తున్నారు. వారికున్న స్థలం వివరాలు కూడా సేకరిస్తున్నారు. మొదటి విడతలో స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తారు. దీంతో పెద్దఎత్తున దరఖాస్తుదారులు ఇళ్ల మంజూరుపై ఆశలు పెట్టుకున్నారు.

పని ఒత్తిడి, సాంకేతిక సమస్యలు..

ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని అధికారులు చెబుతుండడంపై సర్వేయర్లు పెదవి విరుస్తున్నారు. మొన్నటి వరకు ఇంటింటి సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించామని, మళ్ళీ వెంటనే ఇంకో సర్వే అంటే పని ఒత్తిడి ఎక్కువవుతోందని వాపోతున్నారు. దరఖాస్తుదారులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడం వల్ల సర్వే పనులు సాగటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల యాప్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో తరచూ సర్వర్ డౌన్ అవుతుండటంతో చాలా సేపు సర్వేను నిలిపివేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో సిగ్నల్ సమస్యలు తలెత్తుతున్నాయని దాంతో సర్వే పనులు సాగటం లేదాని తెలిపారు. ఉన్నతాధికారులు విషయాలను పరిగణలోకి తీసుకొని గడువు పెంచాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇంటిపైనే ఆశ



చంద్రగిరి శ్రీనివాస్, ద్వారకాపూర్

ఇంతవరకు సొంతిల్లు లేదు. ప్రస్తుతం అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నా. నెలసరి వేతనంలో పావు వంతు ఇంటి అద్దె కోసం చెల్లించాల్సి వస్తోంది. కోటి ఆశలతో ఇందిరమ్మ ఇంటి మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలి. నిజమైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలి. అధికార పక్షపాతం రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలి. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది.

పురుగుల బియ్యంతో వంట ఎలా చేసేది..?



నవతెలంగాణ-కాసిపేట

పురుగుల బియ్యంతో వంట ఎలా చేసేదని మద్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి ప్రశ్నించారు. గురువారం మండలంలోని దేవాపూర్‌లో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి మాట్లాడారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు వండి పెడుతున్న బియ్యం ముక్కిపోయి, పురుగులు పట్టి ఉన్నా, అధికారులు, సివిల్ సప్లయి ద్వారా సరఫరా చేస్తున్నారన్నారు. భోజనం చేసే పిల్లలు అనారోగ్యానికి గురైతే అధికారులదే బాధ్యతన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 4 నెలలుగా బిల్లులు, వేతనాలు రాకపోవడం మూలంగా అప్పుల పాలై వంట నిర్వాణ చేయడం కోసం మరిన్ని అప్పులు చేయడం జరుగుతుందని, వెంటనే బిల్లులు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న అధికారంలోకి వస్తే రూ.10 వేల వేతనం, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, సంవత్సరం గడిచిన నేటికి అమలు చేయడం లేదన్నారు. పైగా మధ్యాహ్న భోజన కార్మికులపైన రోజు రోజుకు అధిక భారం వేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యంతో పాటు సరకులకు కూడా ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో గురువక్క, కనక దేవేంద్ర, కోట్నాక సాంద్రుబాయి, సాయక్క, అంకమ్మ, మణిమ్మ కమలాబాయి, పోషక్క పాల్గొన్నారు.

పోరాటాల చరిత్ర సీపీఐది : కలవేన శంకర్

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల : జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

త్యాగాలు, పోరాటాల చరిత్ర ఎర్రజెండాలదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలవేన శంకర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలకు నెలవుగా పార్టీ పని చేస్తుందని, డిసెంబర్ 30 న నల్లగొండ జిల్లాలో జరిగే పార్టీ ఆవిర్భావ ప్రారంభోత్సవ బహిరంగ సభ ర్యాలీని జయప్రదం చేయాలనీ నాయకులను కోరారు. త్యాగధనులతో నిండిన వారసత్వాన్ని పోరాటాన్ని పునికిపుచ్చుకొని రాబోయే రోజుల్లో మరింత ముందుకు నడవాలని, ఓట్లు సీట్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, కుల మతాలకు ప్రాంతాలకు అతీతంగా పోరాటం కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, లింగం రవి, మిట్టపల్లి పౌల్, దేవి పోచన్న, కనుక లక్ష్మి, నర్సింగరావు, రాయమల్లు, కంచెం పోషం పాల్గొన్నారు.



కాసిపేట : జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కాసిపేట : మండల కేంద్రంలో సీపీఐ శత వసంతోత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్ జెండా ఎగరవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జాడి పోశం, దాడి గట్టయ్య, దాగం రాజలింగు, బండారి సత్తయ్య, దుర్గం పోశం, దుర్గం సుధాకర్, రత్నం భీమయ్య, లింగమూర్తి పాల్గొన్నారు.

ఏకో టూరిజం కార్యక్రమాలను అమలు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ అందాలను చూడడానికి వచ్చే పర్యాటకుల కోసం ఏకో టూరిజం కార్యక్రమాలను అమలు చేయాలని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.సువర్ణ, మంచిర్యాల డీఎఫ్ఓ శివ ఆసీస్ సింగ్ అన్నారు. గురువారం కవ్వాల్ టైగర్ జోన్ అడవుల్లో పర్యటించి, ప్రకృతి అందాలను తిలకించారు. వన్యప్రాణులు, ప్రకృతి వైవిధ్యం, అడవి సంరక్షణ చర్యలను సమీక్షించారు. అడవులలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అడవి సంరక్షణను మరింత బలోపేతం చేయడానికి, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు నూతన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే పర్యావరణ పర్యాటక (ఏకో టూరిజం) కార్యక్రమాలను అమలు చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో జన్నారం, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓలు సుష్మారావు, కారం శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు ప్రతి నెలా నిర్వహించేలా కృషి



నవతెలంగాణ-మందమర్రి

రక్తదాన శిబిరాలు ప్రతీ నెల నిర్వహించేలా కృషి చేస్తానని ఏరియా జీఎం దేవేందర్ తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులకి హామీ ఇచ్చారు. సింగరేణి వృత్తి శిక్షణ కేంద్రంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా నియామకమైన గనులు డిపార్ట్‌మెంట్ల నూతన కార్మికులతో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. మందమర్రి వృత్తి శిక్షణ కేంద్రంలో గతంలో అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించారని గుర్తు చేశారు. జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని వీరికి ప్రతినెల రక్తం అవసరం ఉంటుందని తెలిపారు. సింగరేణి సంస్థ ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో కూడా ముందుంటుందన్నారు. రక్తదాన శిబిరాలు ప్రతీ నెల నిర్వహించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం విజయప్రసాద్, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ శంకర్, ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజిమెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ బెల్లంపల్లి సబ్ డివిజన్ సభ్యులు సూరం లక్ష్మీనారాయణ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ పాల్గొన్నారు.

28న పీఆర్టీ భవన్‌లో గాయకుల ఎంపిక



నవతెలంగాణ-జన్నారం

ప్రముఖ ప్రజాకవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ రచించిన నూరేళ్ల నా ఊరు గేయ కావ్యం, ఓయమ్మ నా పల్లె సీమ పాటల కోసం, గాయనీ గాయకుల ఎంపిక కార్యక్రమం ఈనెల 28న పీఆర్టీ భవన్‌లో ఉంటుందని ఆదర్శ కళా సమితి మండల అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గాయనీ గాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పూర్ణపు రాజారావు ఇటీవల మరణించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి చేయూతగా 25కేజీల రైస్ బ్యాగ్, నిత్యావసర సరకులను అందించడం జరిగింద తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత తెలిపారు. అలాగే పొన్కల్ పట్టణానికి చెందిన కొండ గంగన్న గౌడ్ ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడగా వారి కుటుంబానికి చేయూతను అందించి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వొళ్ళల నర్సగౌడ్, మంతెన వెంకటేష్, పొన్కల్ మాజీ ఉపసర్పంచ్ బాలసాని శ్రీనివాస్ గౌడ్, సతీష్ గౌడ్, గట్టు ముజ్జన్న పాల్గొన్నారు.

